ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
సోమవారం 22 ఏప్రిల్ 2024



6న జగిత్యాలకు మాజీ సీఎం కేసీఆర్ రాక

జగిత్యాల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా వచ్చే నెల 6వ తేదీన జగిత్యాలకు మాజీ సీఎం కేసీఆర్ రానున్నారు. కేసీఆర్ నిర్వహించనున్న బస్సుయాత్ర కార్యక్రమంలో 12వ రోజు జగిత్యాల రోడ్ షో నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ వర్గాలు తెలిపాయి. వచ్చే నెల 6వ తేదీన సాయంత్రం 6 గంటలకు రోడ్ షోలో మాజీ సీఎం కేసీఆర్ ప్రసంగించనున్నారు. అనంతరం జగిత్యాలలోనే రాత్రి బస నిర్వహించడానికి అనుగుణంగా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ నేతృత్వంలో బీఆర్ఎస్ వర్గాలు ఏర్పాట్లపై దృష్టి సారించాయి.

ఉల్లంఘనలపై నిఘా



కలెక్టరేట్‌లో ఎన్నికల పనితీరును పెద్దపల్లి ఎన్నికల వ్యయ పరిశీలకులు సమీర్ నైరెంతర్

- ఎన్నికల నిర్వహణపై ఈసీ దృష్టి
- ప్రత్యేక అధికార బృందాలకు బాధ్యతలు
- ప్రచార తీరు...ఓటర్లకు ప్రలోభాలపై ఆరా
- పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా పక్కాగా పర్యవేక్షణ

జగిత్యాల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల్లో నియమావళి ఉల్లంఘన జరగకుండా అధికారులు డేగ కళ్లతో నిఘా పెడుతున్నారు. ఎన్నికల నిర్వహణలో నిఘా వ్యవస్థ పనితీరు ప్రధానంగా ఉంటుంది. రాజకీయ పార్టీలు, పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటిస్తున్నారా... లేదంటే ఉల్లంఘనలకు పాల్పడుతున్నారా అని పర్యవేక్షించడం కీలకంగా మారుతోంది. ఇందుకు ఎన్నికల సంఘం ఫ్లయింగ్ స్క్వాడ్, ఎంసీసీ, వీడియో సర్వే లైన్స్, స్టాటిస్టిక్ సర్వే లైన్స్, వీడియో వ్యూయింగ్, మీడియా కో ఆర్డినేషన్ మానిటరింగ్, అకౌంటింగ్ బృందాలను ప్రత్యేకంగా నియమించారు. జగిత్యాల జిల్లాలో పలు ప్రాంతాల్లో నిబంధనలు విస్మరించి తరలిస్తున్న నగదును ఈ తనిఖీ బృందాలు పట్టుకుంటున్నాయి. అభ్యర్థులు వారి అనుచరులపై ప్రత్యేక నిఘా సారించాయి. ప్రచారం తీరు, ఓటర్ల ప్రలోభాలకు గురిచేస్తున్నారా...ఇలా పలు కోణాలపై దృష్టి సారించడం గమనార్హం.

ఫ్లయింగ్ స్క్వాడ్..

జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి నియోజకవర్గాలకు ఒక్కో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యశాఖ అధికారి, ఒక పోలీస్ అధికారి, వీడియో గ్రాఫర్ ఉంటున్నారు. ఓటర్లకు డబ్బు, మద్యం పంపిణీ చేస్తున్నారా, ప్రలోభాలకు గురి చేస్తున్నారా అని పర్యవేక్షిస్తారు. వీటికి సంబంధించి వీడియో తీసి రిటర్నింగ్ అధికారులకు నివేదిస్తారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం ఎప్పటికప్పుడు పలు ప్రాంతాల్లో పర్యవేక్షణ చేస్తున్నారు.

వీడియో సర్వేలెన్స్...

జిల్లాలోని ప్రతి నియోజకవర్గానికి రెండు వీడియో సర్వేలెన్స్ బృందాలను నియమించారు. రెవెన్యూ పోలీస్ అధికారులతో పాటు వీడియో గ్రాఫర్ ఉన్నారు. సభలు, సమావేశాలు ర్యాలీలపై దృష్టి సారిస్తున్నారు. ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా చిత్రీకరిస్తున్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తారు.

వీడియో వ్యూయింగ్...

వీడియో సర్వే లెన్స్ బృందాలు తీసిన వీడియోలను నిశితంగా పరిశీలించడమే వీడియో వ్యూయింగ్ సభ్యుల ప్రధాన బాధ్యతగా ఉంటుంది. నియోజకవర్గానికి ఒకటే చొప్పున పని చేస్తోంది. ఇందులో ఒక గెజిటెడ్ అధికారితో పాటు ఇద్దరు సహాయకులు ఉన్నారు. ఉల్లంఘనలు గుర్తించి రిటర్నింగ్ అధికారి దృష్టికి తీసుకెళ్తారు.

మీడియా కో ఆర్డినేషన్ మానిటరింగ్...

మీడియా.. కోఆర్డినేషన్ మానిటరింగ్ బృందం రోజువారీగా దినపత్రికల్లో వచ్చే ప్రకటనలు పార్టీలు, అభ్యర్థులు చేసే ఖర్చులను పక్కాగా లెక్క కడుతుంది. ఈ వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేసి నిత్యం రిటర్నింగ్ అధికారికి నివేదిస్తుంది. అడ్వర్టయిజ్ మెంట్ వ్యయం, పెయిడ్ న్యూస్ తదితర వాటిని ఎప్పటికప్పుడు నమోదు చేస్తున్నారు.

అకౌంటింగ్..

నియోజకవర్గానికి ఒక అకౌంటింగ్ బృందాన్ని ఏర్పాటు చేశారు. ట్రెజరీ లేదా బ్యాంక్ అధికారి బృంద సభ్యుడిగా ఉన్నారు. ఇతర శాఖకు చెందిన ఒకరు సహాయ అధికారిగా పని చేస్తారు. ఈ బృందం సభ్యులు రాజకీయ పార్టీలు, అభ్యర్థుల ఖర్చులను లెక్క కడుతోంది. రోజువారి లెక్కలను రిటర్నింగ్ అధికారికి అందజేస్తారు.

మోడల్ కోడ్ కండక్ట్...

జిల్లాలోని ప్రతి మండలానికి ఒక మోడల్ కండక్ట్ బృందాన్ని (ఎంసీసీ) నియమించారు. నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలోని జగిత్యాల, కోరుట్ల అసెంబ్లీ సెగ్మెంట్లు, కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని చొప్పదండి నియోజకవర్గం మల్యాల, కొడిమ్యాల మండలాలు, వేములవాడ నియోజకవర్గం పరిధిలోని కథలాపూర్, మేడిపల్లి, భీమారం మండలాలు, పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని ధర్మపురి అసెంబ్లీ నియోజ కవర్గాల్లో ఇవి పని చేస్తున్నాయి. గెజిటెడ్ అధికారి నేతృత్వంలో పోలీస్ అధికారి, వీడియోగ్రాఫర్ పని చేస్తున్నారు. అభ్యర్థుల ప్రచారాలు, ఖర్చుల పై నిఘా సారించారు. అన్ని వివరాలను రిటర్నింగ్ అధికారికి తెలియజేస్తున్నారు.

స్టాటిస్టిక్ సర్వేలెన్స్...

జిల్లాలోని ప్రతీ నియోజకవర్గంలో డిప్యూటీ తహసీల్దారు ఆధ్వర్యంలో ఈ బృందం అక్రమాలపై ప్రత్యేక దృష్టి సారిస్తుంది. ఇందులో 8 మంది ఉంటున్నారు. నలుగురు పోలీస్, ఓ అటవీ శాఖ, ఓ అబ్కారీ శాఖ అధికారులతో పాటు వీడియోగ్రాఫర్ ఉంటారు. ఒక్కో నియోజకవర్గానికి మూడు స్టాటిస్టిక్ సర్వే లెన్స్ బృందాల చొప్పున కేటాయించారు.



వాహన తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

కొండగట్టులో ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లు పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్

మల్యాల, ఏప్రిల్ 21: కొండగట్టులో జరిగే చిన్న హనుమాన్ జయంతి ఉత్సవాల ఏర్పాట్లను అడిషనల్ కలెక్టర్ దివాకర పరిశీలించారు. కొండపైన కోనేరు, దీక్షవిరమణ మండపం, కేశఖండన ప్రదేశం, ప్రసాద కౌంటర్లు, క్యూలైన్‌లు, వైద్య శిబిరాలు, పార్కింగ్ స్థలాలు, పారిశుధ్య పనులు తదితరవి పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. అలాగే పోలీస్ బందోబస్తుపై అడిషనల్ ఎస్పీ వినోద్ పోలీస్ సిబ్బంది, అధికారులకు తగు సూచనలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా సెక్టార్‌లుగా విభజించి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆలయ పరిసరాలు పరిశీలించారు. జిల్లా పంచాయతీ అధికారి దేవరాజ్, ఆర్డీవో మధు సూధన్, డీఎంహెచ్‌వో శ్రీధర్, డిఎస్పీ రఘుచందర్, సీఐ నీలం రవి, ఈవో చంద్రశేఖర్ పర్యవేక్షించారు.

జీవన్‌రెడ్డిపై ఎంపీ వ్యాఖ్యలు అప్రజాస్వామికం

ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్

జగిత్యాల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి, ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డిపై ఎంపీ అర్వింద్ అనుచిత వ్యాఖ్యలు చేయడం అప్రజాస్వామికమని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఇందిరా భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగిత్యాలలో పర్యటించిన ఎంపీ అర్వింద్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని నిజామాబాద్‌లో ప్రజలు గుర్తించడం లేదని, ఆర్మూర్ జీవన్ రెడ్డిగా భావిస్తున్నారంటూ వ్యంగంగా మాట్లాడడం సమంజసం కాదన్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రస్తుతం మరోమారు బీజేపీ అభ్యర్థిగా ఎలా పోటీ చేస్తున్నారని విమర్శించారు. ఎజెండా లేకుండా అర్వింద్ ఎన్నికలకు వస్తుండడం అవివేకమన్నారు. నిజాం దక్కన్ షుగర్ లిమిటెడ్ కార్మగారాల పునరుద్ధరణ, పసుపు బోర్డు ఏర్పాటు అంశాలను ఎంపీ అరవింద్ విస్మరించారని ఆరోపించారు. బీజేపీ అభ్యర్థిగా అరవింద్‌కు అవకాశం ఇవ్వవద్దని సొంత పార్టీకి చెందిన నేతలే బీజేపీ అధిష్టానానికి గతంలో ఫిర్యాదు చేశారని గుర్తు చేశారు. జీవన్‌రెడ్డిని నిజామాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో గెలిపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ సమావేశంలో జగిత్యాల జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తాటిపర్తి విజయ లక్ష్మీ దేవేందర్ రెడ్డి, పీసీసీ సెక్రటరీ బండ శంకర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు గాజుల రాజేందర్, అడువాల లక్ష్మణ్ పాల్గొన్నారు.

నేడు జీవన్ రెడ్డి నామినేషన్ దాఖలు

హాజరుకానున్న సీఎం రేవంత్ రెడ్డి

జగిత్యాల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి, ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి ఈనెల 22వ తేదీన నామినేషన్ దాఖలు చేయనున్నారు. నిజామాబాద్‌లో ఏర్పాటు చేసిన రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేయడానికి కాంగ్రెస్ వర్గాలు ఏర్పాట్లు పూర్తి చేశాయి. కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి నామినేషన్ దాఖలు కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరుకానున్నట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి అధిక సంఖ్యలో కార్యకర్తలు, నేతలు, ప్రజలను తరలించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటాలి

మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు విజయ లక్ష్మీ

జగిత్యాల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటాలని జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు, జగిత్యాల మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తాటిపర్తి విజయ లక్ష్మీ దేవేందర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని 45వ వార్డులో నిజామాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి తాటిపర్తి జీవన్‌రెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడారు. ఎంపీగా జీవన్ రెడ్డిని గెలిపిస్తే జగిత్యాల నుంచి తిరుపతికి రైలు సౌకర్యం కల్పిస్తారని, పాస్ పోర్టు కార్యాలయాన్ని అందుబాటులోకి తెస్తారని, పెన్షన్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయిస్తారని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు మహిళా కాంగ్రెస్ నేతలు, సభ్యులు పాల్గొన్నారు.

వస్త్ర పరిశ్రమ సంక్షోభానికి కారణం బీఆర్ఎస్సే

- ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ ● సిరిసిల్లలో బీజేపీ భారీ ర్యాలీ



సిరిసిల్లలో బండిసంజయ్ సమక్షంలో బీజేపీ చేరిన దుమాల శ్రీకాంత్

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 21: వస్త్ర పరిశ్రమ సంక్షోభానికి అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వమే కారణమని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ అన్నారు. సిరిసిల్ల పట్టణానికి ఆదివారం వచ్చిన ఎంపీ బండి సంజయ్ కుమార్‌కు నాయకులు, కార్యకర్తలు కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద గజమాలతో స్వాగతం పలికారు. అక్కడి నుంచి బైక్ ర్యాలీలో పాల్గొని పట్టణంలోని గాంధీచౌక్, అంబేద్కర్ చౌరస్తా, నేతన్న చౌరస్తాల మీదుగా పాత బస్టాండ్ నుంచి పెద్దబజార్‌నుంచి శాంతినగర్‌కు ర్యాలీగా వెళ్లారు. అనంతరం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు దుమాల శ్రీకాంత్ ఆధ్వర్యంలో వంద మంది నాయకులు బండి సంజయ్‌కుమార్ సమక్షంలో బీజేపీలో చేరగా వారికి పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో బండి సంజయ్‌కుమార్ మాట్లాడుతూ సిరిసిల్లలో వస్త్ర పరిశ్రమ సంక్షోభం సమసిపోలేదన్నారు. నేతన్నలంతా ఐక్యంగా ఉంటూ సమ్మె చేశారన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నేను లేఖ రాసి, అనేక రూపాల్లో ప్రభుత్వ తీరును ఎండగట్టానని అయినా స్పందించకపోవడంతో నేతన్నలకు మద్దతుగా సిరిసిల్లలో నేతన్న దీక్షను చేసేందుకు సిద్ధమైతే తప్ప ప్రభుత్వం దిగిరాలేదన్నారు. రూ. 270 కోట్లు బకాయిలుంటే కంటి తుడుపు చర్యగా రూ. 50 కోట్లు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఎన్నికల కోడ్ పేరుతో ఆ నిధులను కూడా ఆపేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు కుట్రలు చేస్తున్నారన్నారు. అదే జరిగితే ఉరుకునే ప్రసక్తే లేదన్నారు. దీంతోపాటు మిగిలిన బకాయిలన్నీ నేతన్నలకు ప్రభుత్వం చెల్లించాల్సి ఉంటుందన్నారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభానికి కారణం ముమ్మాటికి బీఆర్ఎస్ ప్రభుత్వమేనాన్నారు. మాస్టర్ వీవర్స్ పేరుతో పెద్ద యాజమానులకు బతుకమ్మ చీరల ఆర్డర్లను ఇచ్చి యజమానులను, ఆసాములుగా ఆసాములను కూలీలుగా మార్చిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌దేనని అన్నారు. ఇప్పటికైన కాంగ్రెస్ ప్రభుత్వం సిరిసిల్ల నేతన్నల సమస్యలను పరిష్కరించి ప్రభుత్వం వెంటనే పాత బకాయిలను చెల్లించి సంవత్సరం పాటు ఉపాధికి ఇబ్బంది లేకుండా నేతన్నలకు కొత్త ఆర్డర్లను ఇవ్వాలన్నారు. పాత విద్యుత్ బకాయిలను మాఫీ చేయాలన్నారు. కార్మికులకు ఇవ్వాల్సిన 10 శాతం యారన్ సబ్సిడీ వెంటనే అందించాలన్నారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన వర్కర్ టు ఓనర్ పథకాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. వస్త్ర పరిశ్రమలను కాపాడుకోవడానికి నేతన్నలకు ఎప్పుడు అండగా ఉంటానన్నారు. జై శ్రీరాం అంటేనే బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు భయం పట్టుకుందని బీజేపీ నినాదమే జై శ్రీరాం అని రాముడంటే భక్తి ఉండాలి తప్ప బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు జైశ్రీరాం అంటేనే భయం పట్టుకుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అరాచకాలపై అవినీతి అక్రమాలపై బీజేపీ అలుపెరగని పోరాటాలు చేస్తే కాంగ్రెస్ పార్టీకి ఓటేయడం ఎంతవరకు న్యాయమో ప్రజలు ఆలోచించాలన్నారు. దేశం కోసం అహర్నిశలు కష్టపడుతున్న మోదీకి మద్దతివ్వాలని, ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోని వంద శాతం పోలింగ్ జరిగేలా చూడాలన్నారు. ఈసారి జరిగే ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర అధికార ప్రతి నిధి రాణీ రుద్రమరెడ్డి, జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శులు రెడ్డబోయిన గోపి, రేగుల మల్లికార్జున్, జిల్లా ఉపాధ్యక్షుడు శీలంరాజు, పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, కరీంనగర్ పార్లమెంటరీ కో-కన్వీనర్ అడెపు రవీందర్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు బర్కం వెంకటలక్ష్మి, రాష్ట్ర కార్య వర్గ సభ్యులు ఎర్రం మహేష్, మట్ట వెంకటేశ్వర రెడ్డి, గౌడ వాసు పాల్గొన్నారు.

● ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యం వల్లే తడిసిన ధాన్యం..

వీర్నపల్లి: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో 15 రోజులు కావొస్తున్నా కనీస సౌకర్యాలు కల్పించకపోవడం వల్లనే ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యంతో ధాన్యం తడిసిపోయిందని కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోని అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ఆదివారం ఆయన పరిశీలించి రైతులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో వడ్ల రాశులు పోసి 15 రోజులు కావొస్తున్నా రైతుల ఇబ్బందులను ప్రభుత్వం, అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. పండించిన పంటను అమ్ముకోవడానికి రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులను ఎంత గోసపెట్టిందో అదే పద్ధతిని కాంగ్రెస్ ప్రభుత్వం పాటిస్తుందన్నారు. దళారులతో ప్రభుత్వం కుమ్మక్కయిందని, కాంగ్రెస్ ప్రభుత్వం దళారి వ్యవస్థను ప్రోత్సహిస్తుందన్నారు. తడిసిన ధాన్యాన్ని ఎలాంటి కటింగ్‌లు లేకుండా ప్రభుత్వం కొనుగోలు చేయాలన్నారు. రైతులు వచ్చే ఎన్నికల్లో వాస్తవాలను ఆలోచించి ఓటు వేయాలని కోరారు.

● జనగామను సర్వాయ్ పాపన్న జిల్లాగా ఎందుకు మార్చలేదు..

తంగళ్లపల్లి: గౌడన్నల ఆత్మగౌరవ ప్రతీక సర్దార్ సర్వాయ్ పాపన్న పేరును జనగామ జిల్లాకు పెడతామని ఎన్నికల్లో హామీ ఇచ్చి మాట తప్పారని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్ మండిపడ్డారు. ఆదివారం తంగళ్లపల్లి మండలం తాడురు గ్రామ శివారులో కాలి పోయిన తాటిచెట్లను పరిశీలించి గీత కార్మికులను బండి సంజయ్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ రాష్ట్రవ్యాప్తంగా గీత కార్మికులు కష్టాల్లో ఉన్నారని వారిని ఆదుకోవాలనే సోయి ప్రభుత్వానికి లేకుండా పోయిందని మండిపడ్డారు. ప్రతి గ్రామంలో ఐదెకారాల స్థలాన్ని కొనుగోలు చేసి ఈత మొక్కలను పెంచుతామని, ఈత మొక్కల పెంపాకానికి బిందు సేద్యం సబ్సిడీతో ఇస్తామని చెప్పిన హమీ ఏమైందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇప్పటికైనా గీత కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం తాడురులో ఇటీవల విద్యుదాఘాతంతో మృతిచెందిన మహిళా రైతు మధుప్రియ కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబాన్ని ఆదుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి రాణి రుద్రమరెడ్డి, మండల అధ్యక్షుడు వెన్నమనేని శ్రీధర్‌రావు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం



సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొన్న భక్తులు

జగిత్యాల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వాల్మీకి నూతన ఆవాసంలో ఆదివారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ప్రతీ యేటా విద్యా సంవత్సరం ముగింపు సందర్భంగా సామూహిక సత్యనారాయణ వ్రతాన్ని నిర్వహిస్తున్నారు. అదేవిధంగా ఆవాసంలో విద్యార్థుల బంధువులు, పుర ప్రముఖులతో వ్రతం చేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు వేణు మాదావచారి, రామ కృష్ణ, భక్తులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ జర్నలిస్టు సంఘం జిల్లా అధ్యక్షుడిగా టీవీ సూర్యం

జగిత్యాల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ స్టేట్ విశ్వబ్రాహ్మణ జర్నలిస్టు అసోసియేషన్ జగిత్యాల జిల్లా శాఖ అధ్యక్షుడిగా టీవీ సూర్యం, ప్రధాన కార్యదర్శిగా మండ లోజు అక్షరప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం పట్టణంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో జరిగిన జిల్లా శాఖ సమావేశంలో నూతన అధ్యక్ష, కార్యదర్శులను ఎన్నుకున్నట్లు ప్రకటించారు. ఈసందర్భంగా టీవీ సూర్యం మాట్లాడుతూ విశ్వ బ్రాహ్మణ జర్నలిస్టు సంఘ అభివృద్ధికి, సభ్యుల సంక్షేమానికి పాటుపడుతానన్నారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (ఐజేయు) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాగుల గోపాలచారితో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన విశ్వబ్రాహ్మణ పాత్రి కేయులు పాల్గొన్నారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 21 : వేసవి కాలం దృష్ట్యా పట్టణ ప్రజలు త్రాగు, ఇతర అవసరాల కోసం పొదుపుగా వాడుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి అన్నారు. కొత్త బస్టాండ్ సమీపంలో చేపడుతున్న వాటర్ ట్యాంక్ పైపలైను మరమ్మతు పనులను ఆదివారం వేకువజామున చైర్ పర్సన్ పరిశీలించారు.

పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారు. తాగు నీటికి అధిక ఇబ్బందులు ఉంటే ఫోన్ ద్వారా సంప్రదిస్తే ఇంటి వద్దకే వాటర్ ట్యాంకర్ సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

ఉచిత కంటి శస్త్ర చికిత్స శిబిరం

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 21 : జిల్లా కేంద్రంలోని పావని కంటి ఆసుపత్రిలో ఆదివారం నేత్ర వైద్యుడు, ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఉచిత కంటి శస్త్ర చికిత్స శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జగిత్యాల జిల్లాలోని 20 మంది నిరుపేదలకు శస్త్ర చికిత్సలు నిర్వహించి ఉచితంగా అద్దాలు, మందులు అందజేశారు. అనంతరం రోగులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యుడు విజయ్, నాయకులు రమణ రావు, తిరుపతి గౌడ్ ఉన్నారు.

యువతి వివాహానికి బాసట

మల్యాల, ఏప్రిల్ 21: తల్లిదండ్రులను కోల్పోయిన పేదింటి యువతి వివాహానికి మల్యాలకు చెందిన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కట్కం వినయ్ తన వంతుగా బాసటగా నిలిచాడు. గడ్డం అంజయ్య, అతని భార్య లక్ష్మీ అనారోగ్యంతో మృతి చెందారు. వారి కూతురు స్వప్న వివాహం ఆదివారం జరిగింది. దీంతో వినయ్ యువతికి మట్టెలతో పాటు 50కిలోల బియ్యం, పట్టుచీర అందించారు. ఈ సందర్భంగా పలువురు వినయ్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో శనిగారపు తిరుపతి, కోరెపు వెంకటేష్, మ్యాక సాయి, గాడి అనిల్, మల్లేశం పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలి

ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న అడ్లూరి లక్ష్మణ్ కుమార్

పెగడపల్లి, ఏప్రిల్ 21 : పార్లమెంట్ ఎన్నికలలో పెద్దపల్లి, నిజామాబాద్ పార్లమెంట్ స్థానాల కాంగ్రెస్ అభ్యర్థులు గడ్డం వంశీ, తాటిపర్తి జీవన్‌రెడ్డి విజయానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు కలసికట్టుగా కృషి చేయాలని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు. పెగడపల్లి మండల కేంద్రంలో ఆదివారం పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ మండల నాయకులతో కలసి లక్ష్మణ్ కుమార్ విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ పదేండ్లు అధికారంలో ఉండి నియోజకవర్గ రైతులను, ప్రజల సమస్యలను పట్టించుకోని కొప్పుల ఈశ్వర్ ఈ ఎన్నికలలో ఓటర్లను తప్పుదోవ పట్టించేందుకు నాలుగు నెలల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేసింది అంటూ విమర్శిస్తున్నారన్నారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఆరు గ్యారంటీలలో నాలుగింటిని అమలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని అన్నారు. రాముడి పేరుతో ఓట్లు దండుకునే బీజేపీ పదేళ్ల కాలంలో ఏమి చేసిందో చెప్పాలని కోరారు. బీఆర్ఎస్, బీజేపీలను రాష్ట్ర ప్రజలు నమ్మే రోజులు పోయాయన్నారు. 22న నిజామాబాద్ పార్లమెంట్ స్థానానికి నామినేషన్ వేస్తున్న జీవన్‌రెడ్డికి సంఘీభావంగా పార్టీ నాయకులు, అభిమానులు అధిక సంఖ్యలో తరలిరావాలని, 24న గడ్డం వంశీ నామినేషన్ కార్యక్రమానికి అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షులు బుర్ర రాములు గౌడ్, నాయకులు ఒరుగల శ్రీనివాస్, తాటిపర్తి శోభారాణి, భాస్కర్, సంధి మల్లారెడ్డి, అమిరిశెట్టి మల్లారెడ్డి, కడారి తిరుపతి, శ్రీధర్‌రావు, రవినాయక్, కిషన్, రాజు, స్వామి పాల్గొన్నారు.



చికిత్స పొందుతూ బాలుడి మృతి

● ప్రైవేటు ఆస్పత్రి ఎదుట బంధువుల ఆందోళన

సుభాష్‌నగర్, ఏప్రిల్ 21: కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఐదు సంవత్సరాల బాలుడు మృతి చెందాడు. మృతుడి బంధువులు తెలిపి న వివరాల ప్రకారం రామడుగు మండల కేంద్రానికి చెందిన దంపతులు తమ కుమారుడు కీర్తి చైత్రిక్(5)కు గుండెకు సంబంధించిన సమస్యతో ఈ నెల 19న నగరం లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. అతడికి ఈనెల 20న ఆపరేషన్ చేయగా అదే రోజు రాత్రి మృతి చెందినట్లు తెలిపారు. ఆపరేషన్ వికటించడం వల్లే తమ బాబు మరణించాడని ఆరోపిస్తూ ఆందోళన చేపట్టారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

● ఆసుపత్రిని సీజ్ చేయాలి

బాలుడి మృతికి కారణమైన ఆసుపత్రిని సీజ్ చేయా లని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బోనగిరి మహేందర్, బ్రాహ్మణపల్లి యుగేందర్ డిమాండ్ చేశా రు. ధనార్జనే ధ్యేయంగా రోగుల జీవితాలతో ఆడుకుంటు న్నారని ఆరోపించారు. కీర్తి చైత్రిక్‌కు గుండెకు రంధ్రం ఉందని ఆపరేషన్ చేయాలని, రూ.1,70,000ల ప్యాకేజీ అని చెప్పి ఆపరేషన్ చేశారని ఆరోపించారు. అయినప్ప టికీ మరణించాడని బాధ్యులపై చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేప డతామని వారు హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

మానకొండూర్, ఏప్రిల్ 21: మండలంలోని గట్టుదుద్దెనపల్లిలో ఆదివారం మోటారుసై కిల్‌ను కారు ఢీ కొన్న ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. గ్రామ స్థులు తెలిపిన వివరాల ప్రకారం.. తిమ్మాపూర్ మండలంలోని పోలంపల్లి గ్రామానికి చెం దిన శ్రీనివాస్ అనే వ్యక్తి గట్టుదుద్దెనపల్లి వచ్చాడు. పనులు ముగించుకొని స్వగ్రామానికి తిరిగి వెళుతుండగా కరీంనగర్ నుంచి వరంగల్ వెళుతున్న కారు ఢీకొట్టింది. కిందపడిన శ్రీనివాస్‌కు తీవ్రగాయాలయ్యాయి. 108 సిబ్బంది కరీంనగర్‌కు తరలించారు.

బావిలో పడి వృద్ధుడి మృతి


పోశయ్య మృతదేహం

వీణవంక, ఏప్రిల్ 21: మండలంలోని కిష్టంపేట గ్రామాని కి చెందిన బొంగోని పోశయ్య (73) అనే వృద్ధుడు బావిలో పడి మృతి చెందా డు. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పోశయ్య శనివారం ఉదయం బహి ర్భూమికి బయటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపో వడంతో కుటుంబ సభ్యులు వెతుకుతుం డగా ఇంటికి దగ్గరలో గల పొలం సమీపంలో ఉన్న బావి గట్టు పైన చెప్పులు, చేతికర్ర కనిపించాయి. అనుమానంతో బావిలో వెతుకగా పోశయ్య మృతదేహం లభించింది. ప్రమాద వశాత్తు బావిలో పడి మృతి చెందాడని కుటుంబ సభ్యు లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై తిరుపతి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వడదెబ్బతో ఒకరు..

శంకరపట్నం, ఏప్రిల్ 21: వడదెబ్బతో అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శంకరపట్నం మండలం తాడికల్ గ్రామానికి చెందిన బుద్ధార్తి నర్సయ్య (70) అనే వృద్ధుడు ఆదివారం మృతి చెందాడు. ప్రస్తు తం ఎండల తీవ్రత అధికంగా ఉండడంతో శుక్రవారం వడదెబ్బకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు వెంటనే కరీంనగర్‌కు తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం నర్సయ్య మృతి చెందాడు.




















రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

చందుర్తి, ఏప్రిల్ 21 : చందుర్తి మండలం మూడపల్లి గ్రామ శివారులోని మూలమలుపు వద్ద బైక్ అదుపు తప్పి కట్ట లింగంపేట గ్రామం చెందిన యువకుడుకి గాయాలయ్యాయి. గ్రామస్థుల కథనం ప్రకారం..మండలంలోని కట్ట లింగంపేట గ్రామానికి చెందిన గుడిపల్లి గంగాధర్ అనే యువకుడు బైక్‌పై వేములవాడ నుంచి కట్టలింగంపేట గ్రామానికి వెళుతుండగా మూడపెల్లి వద్ద అదుపుతప్పి కిందపడ్డాడు. గాయపడిన గంగాధర్‌ను స్థానికులు చికిత్స నిమిత్తం వేములవాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో యువకుడికి..

గంభీరావుపేట, ఏప్రిల్ 21: మండలంలోని ముస్తాఫనగర్‌లో ఓ యువకుడుకి విద్యుదాఘాతంతో తీవ్రగాయాలయ్యాయి. గ్రామానికి చెందిన కె స్వామి ఆదివారం ఆకస్మాత్తుగా విద్యుదాఘాతంతో గురవ్వడంతో సిరిసిల్లా ఏరియా ఆసుపత్రికి తరలించారు. తీవ్రగాయాలు కావడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

తాటి చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

తంగళ్లపల్లి, ఏప్రిల్ 21: తంగళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన గీత కార్మికుడు సుద్దాల దేవయ్యగౌడ్ ప్రమాదవశాత్తు తాటి చెట్టు పైనుంచి పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వృత్తిలో భాగంగా ఆదివారం తాటి చెట్టు ఎక్కి కల్లు తీస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కింద కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. తోటి కార్మికులు గమనించి 108 వాహనానికి సమాచారం అందించారు. దేవయ్యను జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

పిచ్చికుక్క దాడిలో నలుగురికి గాయాలు

ఎలిగేడు, ఏప్రిల్ 21: పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం నర్సాపూర్ గ్రామంలో ఆదివారం పిచ్చికుక్క వీరంగం సృష్టించింది. ఉదయం ఇంటి పక్కనున్న రోడ్డుపై ఆడుకుంటున్న మెరుగు రమేష్, స్వప్న దంపతుల కుమారుడు శ్రీరామ్(3)తోపాటు మరో ముగ్గురిపై పిచ్చి కుక్క దాడి చేసింది. శ్రీరామ్ తల, ఇతర చోట్ల తీవ్రంగా గాయపరిచింది. శ్రీరామ్‌ను చికిత్స నిమిత్తం సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తర్వాత వైద్యులు సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు.

కారు బోల్తా.. ఇద్దరికి గాయాలు

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 21: మండలంలోని అందుగులపల్లి గ్రామ శివారులో ప్రమాదవశాత్తు కారు బోల్తా పడి ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దకల్వల గ్రామానికి చెందిన నలుగురు బసంత్‌నగర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో శుభకార్యానికి వెళ్లి తిరిగి పెద్దపల్లికి వస్తున్న క్రమంలో అందుగులపల్లి గ్రామ శివారులో ప్రమాదవశాత్తు కారు బోల్తాపడింది. కారులో నలుగురు ప్రయాణిస్తుండగా ఇద్దరికి గాయాలు కావడంతో పెద్దపల్లి ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

ముస్తాబాద్, ఏప్రిల్ 21: మండలంలోని నామాపూర్ గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యంను ఆదివారం ఏఎస్సై వెంకటరమణ పట్టుకున్నారు. ఏఎస్సై వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం నామాపూర్ గ్రామానికి చెందిన వానరాసి దుర్గయ్య అనే వ్యక్తి దాదాపు ఏడు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఇంట్లో నిలువ ఉంచగా ఏఎస్సైకి అందిన సమాచారం మేరకు వాటిని పట్టుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు

కారు బైక్ ఢీ : ఒకరి మృతి

కొడిమ్యాల, ఏప్రిల్ 21 : కరీంనగర్-జగిత్యాల ప్రధాన రహదారిపై ఉన్న మండలంలోని దొంగలమర్రి పోలీస్ చెక్‌పోస్టు సమీపంలో ఆదివారం కారు బైక్ ఢీకొన్న సంఘటనలో బైక్‌పై ఉన్న ఆదిత్య(16)మృతి చెందినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు.. జగిత్యాల వైపు నుంచి కారు కరీంనగర్ వైపు వెళ్తుండగా దొంగలమర్రి పోలీస్ చెక్‌పోస్టు సమీపంలో చల్‌గల్ గ్రామానికి చెందిన ఎం.ఏ సమద్, ఎన్.ఆదిత్య బైక్‌పై కరీంనగర్ నుంచి జగిత్యాల వైపు వస్తుండగా కారు, బైక్ ఢీకొన్నాయి. ఈ సంఘటనలో బైక్‌పై ఉన్న చల్‌గల్ గ్రామానికి చెందిన ఎం.ఏ సమద్, ఎన్. ఆదిత్యకు గాయాలయ్యాయి. క్షత గాత్రులను కొడిమ్యాల బ్లూ కోట్ పోలీసులు చికిత్స నిమిత్తం జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. బైక్ నడుపుతున్న ఎన్.ఆదిత్య ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు.

డిపాజిట్ల పేరుతో మోసం

● చేతులెత్తేసిన సంస్థ ● బాధితుల ఆందోళన

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 21: జిల్లాలో ఓ సంస్థ రికరింగ్ డిపాజిట్లు సేకరించి గడవుతీరాక చెల్లింపులు చేయక చేతులెత్తేయడంతో బాధితులు ఆందోళన చెందుతున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఓ సంస్థ ప్రధాన కార్యాలయంను నెలకొల్పి సిరిసిల్ల, ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట తదితర ప్రాంతాలలో రికరింగ్ డిపాజిట్‌లు, డిపాజిట్‌లు సేకరించింది. రికరింగ్ డిపాజిట్‌లు, డిపాజిట్‌ల సేకరణకు కమీషన్‌ల ఆశ చూపడంతో పలువురు నిరుద్యోగ యువకులు ఏజెంట్లుగా చేరి అనేకమంది వద్ద పొదుపు పేరిట డిపాజిట్‌లు సేకరించారు. ఒక్కొక్కరి వద్ద ప్రతి నెల రూ.1000 నుంచి రూ. 10 వేలు వసూలుచేసి 60 నెలలకు సేకరించారు. ఈ విధంగా వందలాది మంది డిపాజిట్‌లు, రికరింగ్ డిపాజిట్‌ల పేరిట డబ్బులు కట్టి గడువు తీరిన తర్వాత ఆ డబ్బు రెట్టింపు మొత్తంను ఆ సంస్థ చెల్లించడం లేదు. రికరింగ్ డిపాజిట్‌ల సేకరణకు ఏర్పాటు చేసిన ప్రధాన కార్యాలయం తెరువడం లేదు. దీంతో అనేక మంది బాధితులు కార్యాలయానికి వచ్చి ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ఆ సంస్థపై జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్‌లలో బాధితులు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు ఆ సంస్థపై మూడు కేసులు నమోదయ్యాయి. ఈ విషయమై సిరిసిల్ల టౌన్ సిఐ రఘుపతిని సంప్రదిస్తే ఇప్పటివరకు ఆ సంస్థపై ఒక కేసు నమోదు చేశామని, సిరిసిల్ల పట్టణంలోని పత్తిపాక వీధిలో ఏర్పాటు చేసిన ఆ సంస్థలో ఎవరైనా పెట్టుబడి పెట్టి నష్టపోయి ఉంటే వెంటనే ఫిర్యాదు చేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ కాంగ్రెస్ నేత మృతి


శేఖర్ (ఫైల్)

గొల్లపల్లి, ఏప్రిల్ 21 : పెగడపల్లి మండలం నందగిరి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ గొల్లపల్లి మండల యూత్ ప్రధాన కార్యదర్శి, మండలంలోని ఇబ్రాజ్ పల్లె గ్రామానికి చెందిన సంకటి చంద్రశేఖర్ యాదవ్ (31) చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. చంద్రశేఖర్ కరీంనగర్ జిల్లా గంగాధర మండలానికి వెళ్లి ఇంటికి వస్తుండగా రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. చంద్రశేఖర్‌కు తల్లిదండ్రులు, భార్య శిరీష, ముగ్గురు చిన్నారులు ఉన్నారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ బాధిత కుటుంబానికి రూ.20వేలు అందించాడు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కటారి చంద్రశేఖర్‌రావు, కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు ముస్కు నిశాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా మల్లన్న బోనాలు


ఆలయం చుట్టూ బోనాలతో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్, 21 : మండలంలోని మాసాయిపేట గ్రామంలో మల్లన్న స్వామి బోనాల జాతర వైభవంగా యాదవుల ఆధ్వర్యంలో జరిపారు. ఆదివారం ఉదయం ఆలయంలోని ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, పూజలు పురోహితుడు నిర్వహించారు. సాయంత్రం బోనాల జాతరను ఘనంగా నిర్వహించారు. భక్తులకు ఆలయాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొసగంటి మహేష్, మొండి వెంకటేష్‌యాదవ్, జాయ మహేష్‌యాదవ్, శరత్, అరుణ్, శ్రీకాంత్ సెంథిల్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

నేటి నుంచే హనుమాన్ చిన్న జయంతి ఉత్సవాలు

● మూడు రోజుల పాటు వేడుకలు
● తరలిరానున్న లక్షలాది భక్తులు

మల్యాల ఏప్రిల్ 21: కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధిలో సోమవారం నుంచి హనుమాన్ చిన్న జయంతి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ప్రతియేటా నిర్వహించే హనుమాన్ చిన్న జయంతిని సోమవారం నుంచి బుధవారం వరకు వైభవంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ మూడు రోజులపాటు వివిధ ప్రాంతాల నుంచి లక్షలాదిగా అంజన్న దీక్షాపరులు, భక్తులు కాలినడకన, వాహనాల ద్వారా అంజన్న సన్నిధికి చేరుకోనున్నారు. ఇక్కడ మాల విరమణ చేయడం అత్యంత పవిత్రంగా భావిస్తారు. కొండగట్టులో జరిగే ఉత్సవాల కోసం అంజన్న ఆలయ పరిసరాలలో క్యూలైన్, బారికేడ్లు తదితర ఏర్పాట్లు చేశారు. ఈ ఉత్సవాలకు సుమారు 650మందితో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. దిగువ కొండగట్టు, ఘాట్‌రోడ్డు, కొండపైన, ఆలయం, దీక్షవిరమణ మండపం, ప్రసాదాల కౌంటర్, కోనేరు, పార్కింగ్ స్థలాలు, జేఎన్ టీయూ, దొంగల మర్రి ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తారు.


కొండగట్టులో స్వాగత తోరణం


కొనసాగుతున్న పనులు


మాల విరమణ చేస్తున్న దీక్షాపరులు

● ఏర్పాట్లు ఇలా..

- కొండపైన, ఘాట్‌రోడ్డుపైన 28 చోట్ల చలివేంద్రాలతో పాటు మొబైల్ వాహనాల ద్వారా భక్తులకు నీటిని అందించనున్నారు.
- ఘాట్‌రోడ్డు వాహనాలకు అనుమతి లేకపోగా.. కొండపైన బొజ్జ పోతన్న, కొండగట్టు స్టేజీల వద్ద పోలీసుల ఔట్ పోస్టు
- దీక్షవిరమణలకు ప్రస్తుతం ఉన్న అర్చకులకు తోడు మరో వంద మంది సిబ్బంది.
- కొండగట్టు స్టేజీ సమీపంలోని తుమ్మ చెరువు, కొండపైన బొజ్జ పోతన్న ఆలయం, దొంగలమర్రి-జేఎన్‌టీయూ మార్గంలో బృందావనం రిసార్ట్, జేఎన్‌టీ యూ సమీపంలో కొండపైకి వెళ్లే మార్గంలో, దాని పక్కనే మరొకటి వాహనాల కోసం పార్కింగ్
- బస్టాండ్ వద్ద 14 ప్రసాద, టికెట్ కౌంటర్లు
- 5 కేంద్రాలలో మూడు షిఫ్ట్‌లలో కొండపైన, స్టేజీ వద్ద వైద్య సిబ్బంది విధులు
- మెట్ల మార్గంలో విద్యుత్ దీపాల ఏర్పాటు. 24గంటల విద్యుత్ సౌకర్యం. 9 జనరేటర్‌ల ఏర్పాటు
- అందుబాటులో ఫైర్ ఇంజన్.. అంబులెన్స్, భక్తులకు సరిపడా ఆర్టీసీ బస్సుల సేవలు
- తాత్కలిక మరుగుదొడ్లు, మొబైల్ మరుగుదొడ్లు

అన్ని ఏర్పాట్లు చేశాం
చంద్రశేఖర్, ఈవో

జయంతి ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశాం. తాగునీటి కోసం చలివేంద్రాలు, మొబైల్ చలివేంద్రాలు, పార్కింగ్ ఏర్పాట్లు చేపట్టాం.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

● తప్పిన ప్రమాదం

ముత్తారం, ఏప్రిల్ 21: మంథని-ఓడేడు ప్రధాన రహదారి ముత్తారంలో ఆర్టీసీ బస్సుకు పెను ప్రమాదం తప్పింది. ముత్తారం మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం సమీపాన ప్రధాన రహదారి పైనే ఇసుక డీడీల కోసం లారీలు రోడ్డుపై నిలిపివేయడంతో ఓడేడు నుంచి గోదావరిఖని వేళుతున్న ఆర్టీసీ బస్సు ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి లారీని ఢీకొట్టాడు. ఆ సమయంలో ఆర్టీసీ బస్సులో ఎక్కు మంది ప్రయాణికులు లేకపోవడంతో పాటు రోడ్డుపై ప్రయాణికులు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.

మరిమడ్లలో హైమాస్ట్ లైట్‌ల చోరీ

కోనరావుపేట, ఏప్రిల్ 21 : కోనరావుపేట మండలం మరిమడ్లలో శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు హైమాస్ట్ లైట్లను అపహరించారు. మరిమడ్ల గ్రామంలోని పల్లెప్రకృతి వద్ద నూతనంగా ఏర్పాటు చేసి దానికి సంబంధించిన పనులు కొనసాగుతున్న నేపథ్యంలోనే గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. పోలీసులకు ఫిర్యాదుచేసినట్లు గ్రామ పంచాయతీ సిబ్బంది తెలిపారు.

అమెరికాలో రోడ్డు ప్రమాదం : హుజూరాబాద్ యువకుడి మృతి


ముక్క నివేష్ (ఫైల్)


డాక్టర్ నవీన్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ప్రణవ్

హుజూరాబాద్, ఏప్రిల్ 21: కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌కు చెందిన ఓ విద్యార్థి శనివారం అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. హుజూరాబాద్ పట్టణానికి చెందిన డాక్టర్ ముక్క నవీన్-స్వాతి దంపతుల కుమారుడు ముక్క నివేష్ (19) బీటెక్ చదవడం కోసం ఏడాదిన్నర క్రితం అమెరికాలోని అరిజోనా రాష్ట్రానికి వెళ్లాడు. ప్రస్తుతం నివేష్ బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. నివేష్ శనివారం (అమెరికా కాలమాన ప్రకారం) తన స్నేహితులతో కలిసి కారులో జలపాతం చూసేందుకు వెళ్లాడు. తిరిగి అరిజోనాలోని తన ఇంటికి వెళ్తున్న క్రమంలో వెనుక నుంచి వచ్చిన కారు బలంగా వీరు ప్రయాణిస్తున్న వాహనాన్ని ఢీకొట్టింది. కారులో వెనుక కూర్చున్న నివేష్‌తో పాటు హనుమకొండ జిల్లా స్టేషన్ ఘణపూర్‌కు చెందిన గౌతమ్ అనే విద్యార్థి అక్కడికక్కడే మృతి చెందారు. అరిజోనా పోలీసులు నివేష్ తండ్రి డాక్టర్ నవీన్‌కు సమాచారం అందించారు. చదువు కోసం వెళ్లిన కొడుకు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో నవీన్ కుటుంబంలో విషాదం నెలకొంది. కాగా నివేష్ తాత కృష్ణమూర్తి సైతం వైద్యుడిగా సేవలు అందించారు. నివేష్ మృతదేహం అమెరికా నుంచి హుజూరాబాద్‌కు రావడానికి మూడు రోజులు పట్టే అవకాశం ఉందని సమాచారం.

● పలువురి పరామర్శ

ప్రముఖ వైద్యుడు నవీన్ కుమారుడు అమెరికాలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలుసుకున్న పలువురు ప్రముఖులు మృతుడి కుటుంబ సభ్యులను ఆదివారం పరామర్శించారు. హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్‌తో పాటు పలువురు ప్రముఖులు నవీన్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, ఎంపీ బండి సంజయ్‌కుమార్, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, మాజీ మంత్రులు ఈటల రాజేందర్, ఇనుగాల పెద్దిరెడ్డి నవీన్‌తో ఫోన్‌లో మాట్లాడారు.

గంజాయి విక్రయిస్తే పీడీ యాక్ట్ నమోదు



మాట్లాడుతున్న సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహాజన్

వేములవాడ రూరల్, ఏప్రిల్ 21: గంజాయి రవాణా, విక్రయాలు జరిపితే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని ఎస్పీ అఖిల్ మహాజన్ హెచ్చరించారు. వేములవాడ రూరల్ సర్కిల్ ఇనిస్పెక్టర్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వేములవాడ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో నిషేదిత గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసి వారి వద్దనుంచి 5కిలోల గంజాయి స్వాధీనపరచుకుని సీజ్ చేసామన్నారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన వికాస్, ఒడిశా నుంచి అదే రాష్ట్రానికి చెందిన ఇద్దరు మైనర్ల ద్వారా 5కిలోల గంజాయిని తెప్పించి ముగ్గురు జగదల్పూర్‌లో కలుసుకుని సిరిసిల్ల, వేములవాడ పట్టణాలలో గంజాయి అలవాటు పడిన వ్యక్తులకు అమ్మి సులవుగా డబ్బు సంపాదించాలనుకున్నారు. ఇదే క్రమంలో జగదల్పూర్ నుంచి బస్సులో కరీంనగర్‌కు అక్కడి నుండి వేములవాడ మండలం చింతల్‌ఠాణా శివారుకి వస్తున్నారన్న సమాచారంతో శనివారం సాయంత్రం చింతల్‌ఠాణా బస్‌స్టాప్ వద్ద వేములవాడ పట్టణ పోలీసలు అదుపులోనికి తీసుకుని వారి వద్ద నుంచి 5కిలోల గంజాయిని స్వాధీన పరచుకున్నారు. గంజాయి మహమ్మారిని తరమికొట్టడంలో బాగంగా కఠినంగా వ్యవహరిస్తామని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. వేములవాడ ప్రాంతంలో నిషేదిత గంజాయిని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రజలు సహకరించాలన్నారు. మన చుట్టుప్రక్కల గంజాయి విక్రయించినట్లు తెలిసినా, గంజాయిని సేవిస్తున్నట్లు తెలిసినా పోలీసులకు సమాచారం అందించాలని లేదా 100కు డయల్ చేయాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ సంవత్సరంలో జిల్లాలో గంజాయికి సంబంధించి 14 కేసులు నమోదు చేసి 39 మందిని అరెస్టు చేసామని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. గంజాయి నిందితులను అరెస్టు చేయడంలో చురుకుగా వ్యవహరించిన ఐడీ పార్టీ కానిస్టేబుళ్ల సమీ, గోపాల్, శ్రీనివాస్‌లను ఎస్పీ అఖిల్ మహాజన్ రివార్డులను అందజేసి అభినందించారు. ఈ సమావేశంలో వేములవాడ ఇంచార్జి డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, రూరల్ , పట్టణ ఇంచార్జి సీఐ శ్రీనివాస్, టౌన్ ఎస్సై అంజయ్య, పోలీసు సిబ్బంది ఎటటటటటటటటటటటాల్గొన్నారు.

వైభవంగా శ్రీరామచంద్ర స్వామి రథోత్సవం

● భారీగా తరలి వచ్చిన భక్తులు


స్వామివారి రథోత్సవం

బీర్‌పూర్,ఏప్రిల్ 21:బీర్‌పూర్ మండలంలోని కొల్వాయి గ్రామంలో ఆదివారం శ్రీ రామచంద్ర స్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. సీతారాముల ఉత్సవ విగ్రహాలను అందంగా రంగు రంగుల పూలతో అలంకరించిన రథం వద్దకు సన్నాయి మేళాలతో వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య తీసుకవచ్చి రథంపై ఆశీనుల గావించి రథోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. రథోత్సవం నిర్వహిస్తున్న సమయంలో హనుమాన్ దీక్షాపరులు రామ భజనలు చేస్తూ నృత్యాలు చేశారు. జాతర బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు ఆయా ప్రాంతాలనుంచి భక్తులు బారీ సంఖ్యలో తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాలలో భక్తుల దాహార్తిని తీర్చడం కోసం గ్రామంలోని అక్షర హైస్కూల్ కరస్పాండెంట్ పైడి మారుతి ఆధ్వర్యంలో మజ్జిగా ప్యాకెట్లు, చల్లని నీరు అందించారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటీసీ పాత పద్మ రమేస్, ఎంపీటీసీ రంగు లక్ష్మన్, ఆలయ చైర్మన్ సతీస్, నాయకులు గుండేటి సురేష్, గాజర్ల రామచంద్రం గౌడ్, రామకిష్టు గంగాధర్, రంగు మల్లేశం, జక్కుల చెంద్రయ్య, రవిందర్ రావ్ భక్తులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణ కేసులో ఇద్దరి అరెస్టు


నిందితులను అరెస్టు చేసి జైలుకు తరలిస్తున్న సీఐ ప్రదీప్‌కుమార్

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 21: నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి, ఇదివరకే విక్రయించిన భూమిని ఆక్రమించిన కేసులో నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి ఇద్దరు నిందితులను అరెస్టు చేశామని కరీంనగర్ రూరల్ సీఐ ఎ.ప్రదీప్‌కుమార్ తెలిపారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు తెలిపారు. సీఐ వివరాల ప్రకారం.. గన్నేరువరం మండల కేంద్రానికి చెందిన తెల్ల రాజయ్య అనే వ్యక్తి 2003లో తీగలగుట్టపల్లిలో సర్వేనెంబరు 233/ఇ లోని వెంచర్‌లో 293.33 గజాల విస్తీర్ణం కలిగిన 16వ ప్లాట్‌ను మూలగౌరారెడ్డి వద్ద కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. మూల గౌరారెడ్డి మరణానంతరం అతని కొడుకు మూల తిరుమలరెడ్డి ఆ ప్లాట్ మాదేనంటూ ఆక్రమించుకుని, రెండు ప్లాట్లుగా విభజించి ఆ ప్లాట్ మూల వీరమ్మ పేరిట తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సృష్టించాడు. అనంతరం ఆ రెండు ప్లాట్లను మూల సూర్యప్రకాష్‌రెడ్డి, లంక శేఖర్‌లకు విక్రయించినట్లు తప్పుడు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు సృష్టించడంతో పాటు ఆ స్థలంలో గోడను కూడా నిర్మించారు. దీంతో బాధితుడు తెల్ల రాజయ్య కరీంనగర్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విచారణ అనంతరం నిందితులు భూమిని విక్రయించి, మళ్లీ ఆ భూమిని ఆక్రమించినట్లు వెల్లడైంది. ఈ మేరకు నిందితులపై ఐపీసీ సెక్షన్ 420, 467, 468, 471, 120 బి, రెడ్‌విత్ 34 కింద కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. నిందితు లు మూల తిరుమల్‌రెడ్డి, లంక శేఖర్‌లను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా జడ్జి ఆదేశాలతో 14 రోజుల రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

పల్లెల్లో ప్రబలుతున్న పచ్చకామెర్లు


తుర్కలమద్దికుంటలో రక్త నమూనాల సేకరణ

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 21: మండలంలోని పలు గ్రామాల్లో 120 మందికి పైగా పచ్చకామెర్ల వ్యాధితో బాధపడుతున్నారు. మండలంలోని తుర్కలమద్దికుంట, అప్పన్నపేట, హన్మంతునిపేట, భోజన్నపేట గ్రామాల్లో కలుషిత నీటి వల్ల పచ్చకామెర్ల వ్యాధి వస్తున్నట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. రాఘవపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో హన్మంతునిపేట, భోజన్నపేట గ్రామాల్లో పచ్చకామెర్ల వ్యాధి ప్రారంభ దశలో ఉంది. ప్రభుత్వ వైద్యుల దృష్టికి వచ్చిన ప్రకారం కలుషిత నీటితో తయారు చేసిన ఐస్ క్రీం, క్లోరినేషన్ లేని తాగునీటి వల్ల వస్తున్నట్లు అంచనా వేస్తున్నారు. అత్యధిక కేసులు నమోదు అయిన గ్రామాల్లో వైద్య సిబ్బంది ఇంటింటా సర్వే నిర్వహిస్తూ నివేదికలను వైద్యాధికారులకు పంపిస్తున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సంబంధిత గ్రామాల్లో తాగునీటి నమునాలను సేకరించి పరీక్షల కోసం ల్యాబ్‌లకు పంపిస్తున్నారు. తాగునీటిని క్లోరినేషన్ చేసిన తరువాతనే సరఫరా చేస్తున్నామని ఎంపీడీవో గున్నాల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

అప్పు ఇచ్చిన వారి వేధింపులతో మహిళ ఆత్మహత్య


రాజమల్లమ్మ

సుల్తానాబాద్, ఏప్రిల్ 21: అప్పుల వారి వేధింపులు భరించలేక పోగుల రాజమల్లమ్మ (57) మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని సుద్దాల గ్రామంలో జరిగింది. ఎస్ఐ శ్రావణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం సుల్తానాబాద్ మండలంలోని సుద్దాల గ్రామానికి చెందిన పోగుల గట్టయ్య రాజమల్లమ్మ దంపతులు ఆదే గ్రామానికి చెందిన పోగుల సంపత్ వద్ద నాలుగేళ్ల క్రితం ఒక లక్ష ముప్పైవేల రూపాయలను అప్పుగా తీసుకున్నారు. ఈ అప్పు తీర్చాలంటూ సంపత్ పదే పదే రాజమల్లమ్మ ఇంటి వద్ద గొడవ చేసేవాడని తరుచూ వారు ఉండే ఇంటికి తాళాలు వేసి వేధించేవాడని చెప్పారు. ఏడాది క్రితం గట్టయ్య చనిపోగా ఆయన భార్య రాజమల్లమ్మ ఒంటరిగా ఇంటి వద్ద ఉంటుంది. ఆమెను అప్పు చెల్లించాలని వేదిస్తున్నారు. పలు సార్లు పెద్ద మనుష్యుల వద్ద పంచాయతీలు కూడా జరిగాయి. దాంతో ఏడాది క్రితం రాజమల్లమ్మ లక్ష రూపాయలను సంపత్‌కు చెల్లించింది. కాగా మిగిలన ముప్పై వేల రూపాయలతో పాటు వాటికి సంబంధించిన వడ్డీ చెల్లించాలని రాజమల్లమ్మ ఇంటి వద్దకు వచ్చి సంపత్ వేధింపులకు గురి చేసేవాడని ఈ నేపధ్యంలో శనివారం కూడా రాజమల్లమ్మను ఇలాగే వేధించగా అమె వనస్తాపం చెంది ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. చికిత్స నిమిత్తం సుల్తానాబాద్ అస్పత్రికి తర లించగా మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ తీసుకువెళ్లారు. అక్కడ ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆది వారం మధ్యాహ్నం మృతి చెందినట్లు ఎస్ఐ వివరించారు. మృతురాలి కొడుకు పోగుల ప్రభాకర్ ఫిర్యాదు మేరకు సంపత్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రావణ్ తెలిపారు.

వైభవంగా సీతారాముల ప్రాణ ప్రతిష్ఠాపనోత్సవాలు


మల్కాపేట రామాలయంలో ప్రాణప్రతిష్ఠ కార్యక్రమంలో చిన్నజీయర్ స్వామి

కోనరావుపేట, ఏప్రిల్ 21: కోనరావుపేట మండలం మల్కాపేట రిజర్వాయర్ ప్రాంతంలోని గుట్టపైన నిర్మించిన సీతారాముల ఆలయంలో ఆదివారం శ్రీ చిన్న జీయర్ స్వామి చేతుల మీదుగా ధ్వజస్తంభ, విగ్రహాల ప్రాణప్రతిష్ఠ అంగరంగ వైభవంగా జరిగింది. కోనరావుపేట మండలం మల్కాపేట రిజర్వాయర్ ప్రాంతంలోని గుట్టపైన మాజీ మంత్రి ఆనందరావు కుటుంబ సభ్యులు చెలిమెడ వెంకటేశ్వరరావు, లక్ష్మీనరసింహారావు, మధుసూదన్‌రావు కుటుంబ సభ్యుల సహకారంతో రామాలయ నిర్మాణాన్ని నిర్మించారు. ఈ నెల 18 నుంచి ఆదివారం వరకు ధ్వజస్తంభన ఉత్సవాలు ప్రాణప్రతిష్ఠ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ధ్వజస్తంభ ఏర్పాటుకు శనివారం రాత్రి చిన్న జీయర్‌స్వామి మల్కాపేటకు చేరుకొని ఆదివారం ఉదయం నుంచి ఆయన చేతుల మీదుగా విగ్రహ ప్రాణప్రతిష్ఠ నిర్వహించారు. అనంతరం కుటుంబ సభ్యులను, భక్తులను దీవించారు. పక్కనే ఉన్న మల్కాపేట రిజర్వాయర్ ప్రాంతాన్ని పరిశీలించారు, అతి తొందరలోనే ఈ ప్రాంతం ఆధ్యాత్మికతతో విరాజిల్లుతుందని ఈ ప్రాంతానికి సీత, రామ, లక్ష్మణులు వచ్చారని ఈ ప్రాంతం ధన్యమైపోతుందని భక్తులకు ఉపదేశాన్ని ఇచ్చారు. ఈ వేడుకల్లో కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, లోకయుక్త చైర్మన్ సి.వి.రాములు, కోరుట్ల మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు, జడ్పీ చైర్ పర్సన్ అరుణ రాఘవరెడ్డి, నాఫ్స్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, లోక బాపురెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి, కోనరావుపేట ఎంపీపీ చంద్రయ్య గౌడ్, ప్యాక్స్ చైర్మన్లు రామ్మోహన్‌రావు, బండ నర్సయ్య, గ్రామ మాజీ సర్పంచ్‌ఆరె లత, మహేందర్, సెస్ వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి, బీఆర్ఎస్ నాయకులు మల్యాల దేవయ్య, రాఘవరెడ్డితో పాటు పలు గ్రామాల ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

చిన్న హనుమాన్ జయంతికి ఏర్పాట్లు



ప్రసన్నాంజనేయస్వామికి పూజలు చేస్తున్న సిబ్బంది(ఫైల్)

ధర్మపురి, ఏప్రిల్ 21: ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీనృసింహస్వామి అనుబంధ శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం నిర్వహించే చిన్న హనుమాన్ జయంతి ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ ఈవో సంకటాల శ్రీనివా స్ తెలిపారు. మూడు రోజుల పాటు హనుమాన్ భక్తులు క్షేత్రానికి చేరుకుని స్వామి వారలను దర్శనం చేసుకుంటారని చెప్పారు. దీంతో భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. వసతుల ఏర్పాట్లపై ఆలయ అర్చకులు, సిబ్బందితో కలిసి చర్చించి నిర్ణయించినట్లు వివరించారు. కాగా మంగళవారం ఉదయం 5 గంటలకు స్వామి వారలకు మన్యసూక్త అభిషేకం, షోడశో పచార పూజలు, నివేదన, నీరాజన మంత్ర పుష్పములు, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు ఉంటాయని ఈవో శ్రీనివాస్ తెలిపారు. భక్తులు ఉత్సవాల్లో పాల్గొనాలని ఆయన కోరారు.

భక్తులు భాగస్వాములు కావాలి

మెట్‌పల్లి, ఏప్రిల్ 21: పట్టణంలో నిర్వహించే శ్రీ వీరహనుమాన్ విజయయాత్రలో భక్తులు భాగస్వాములు కావాలని విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ నాయకులు అన్నారు. పట్టణంలో ఆదివారం విలేకరుల సమావేశంలో పలువురు మాట్లాడారు. పట్టణంలో సోమవారం సాయంత్రం 4గంటలకు ఆరపేట శివాలయం నుంచి ప్రారంభమై పట్టణంలోని జాతీయ రహదారి గుండా అయ్యప్ప స్వామి ఆలయం వరకు నిర్వహించే శ్రీ వీర హనుమాన్ విజయయాత్రకు హిందువులు హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు పోహార్ తుకారాం, ప్రఖండ కార్యదర్శి భాస్కర్, పట్టణ కార్యదర్శి రాజశేఖర్ పాల్గొన్నారు.

కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

మల్యాల, ఏప్రిల్ 21: కరీంనగర్ ఎంపీగా గతంలో అభివృద్ధి పనులు చేపట్టిన బీఆర్ఎస్ అభ్యర్థి బి వినోద్‌కుమార్‌ను మరోసారి గెలిపించుకునేందుకు కార్యకర్తలకు ప్రజల్లోకి వెళ్లాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పిలుపునిచ్చారు. మల్యాలలో ఆదివారం పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం మల్యాల మండల కేంద్రంలో బీఆర్ ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ నిర్వహించే రోడ్‌షోను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులను కోరారు. సమావేశంలో చొప్పదండి నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జీ పడాల భూపతిరెడ్డి, జడ్పీటీసీ కొండపల్కుల రామ్మోహన్‌రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జనగాం శ్రీనివాస్, సింగిల్‌విండో చైర్మన్లు సాగర్‌రావు, మధుసూదన్‌రావు జడ్పీ కోఆప్షన్ సభ్యుడు సుభాన్, మాజీ ఎంపీపీ తైదల శ్రీలత పాల్గొన్నారు.

రేపు సీతారాముల కల్యాణం

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్ 21: మండలంలోని బండలింగాపూర్ గండి హనుమాన్ ఆలయంలో మంగళవారం సీతారాముల కల్యాణం నిర్వహిసామని ఆలయ ఈవో విక్రమ్‌గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. యేటా హనుమాన్ జయంతి సందర్భంగా ఆలయంలో జాతర ఉత్సవాలను నిర్వహణాధికారులు ఘనంగా నిర్వహిస్తారని పేర్కొన్నారు. మంగళవారం చిన్న హనుమాన్ జయంతి సందర్భంగా కల్యాణం నిర్వహిస్తారని తెలిపారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదానం ఉంటుందని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

ఆలయాల్లో ధ్వజారోహణ



కోరుట్లలో పూజలు చేస్తున్న భక్తులు

కోరుట్ల, ఏప్రిల్ 21: పట్టణంలోని అభయాంజనేయస్వామి ఆలయంలో ఆదివారం అంజన్న జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. భక్తులు ఈ ఉత్సవాన్ని చూసేందుకు తరలివచ్చా రు. అర్చకులు ఉద్దంటి శ్యాంసుందర్, శ్రీధర్, శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఈ కార్య క్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఈవో విక్రమ్, జూనియర్ అసిస్టెంట్ పైడిపల్లి నర్సయ్య, రాములు, మనోజ్ ఉన్నారు.

కథలాపూర్: మండల కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం నూతన ధ్వజస్తంభం ఏర్పాటు నిర్వహించారు. సుమారు రూ. 2 లక్షల వ్యయంతో రాతి ధ్వజస్తంభం ఏర్పాటు చేశారు. దీని కోసం కుంట నారాయణరెడ్డి అనే ఇరిగేషన్ ఇంజినీర్ కొంత మేర విరాళం అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కిషన్‌రెడ్డి పాల్గొన్నారు.

దివ్యాంగులను ప్రభుత్వం ఆదుకుంటుంది

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్ 21: దివ్యాంగులను కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని పార్టీ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. మండలంలోని బండలింగాపూర్ గ్రామంలో ఆదివారం మూగవారైన క్యాతం వెంకటరెడ్డి, స్వాతి వివాహ వేడుకల్లో ఆయన పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం దివ్యాంగుల అభివృద్ధికి అన్ని విధాల సహకారం అందించడానికి ప్రత్యేక పథకాలు ప్రవేశపెట్టే ఆలోచనలో ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండలా ధ్యక్షు డు తిప్పిరెడ్డి అంజిరెడ్డి, తిరుమల గంగాధర్, మహిపాల్‌రెడ్డి, జంగా గంగా స్వామి, రాజారెడ్డి, అజయ్ పాల్గొన్నారు.

మల్లన్న జాతరలో ప్రత్యేక పూజలు



ఎఖీన్‌పూర్‌లో మల్లన్న జాతరలో పాల్గొన్న జువ్వాడి కృష్ణారావు

కోరుట్ల, ఏప్రిల్ 21 : పట్టణంలోని అనుబంధ గ్రామమైన ఎఖీన్‌పూర్‌లో ఆదివార నిర్వహించిన మల్లన్న స్వామి జాతరలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. జాతరకు వివిధ గ్రామాల నుంచి జనం స్వామివారిని దర్శించుకునేందుకు తరలివచ్చారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు తిరుమల గంగాధర్, మండల పార్టీ అధ్యక్షుడు కొంతం రాజం, మహిపాల్‌రెడ్డి, బన్న రాజేశ్, లక్ష్మణ్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం తూకంలో చేతివాటం

- ఒక్కో సంచికి 4 కిలోలు అదనంగా కాంటా
- నిలదీసిన రైతులకు నిర్వాహకుల బెదిరింపు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు



44.350 కిలోలు తూకం వేసిన ధాన్యం సంచి

పెగడపల్లి, ఏప్రిల్ 21: పెగడపల్లి మండలంలోని మద్దులపల్లిలో ధాన్యం తూకంలో సిబ్బంది చేతివాటం ప్రదర్శించారు. బాధిత రైతులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. పెగడపల్లి మండంలోని మద్దులపల్లి గ్రామంలో పెగడ పల్లి సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహణకు అదే గ్రామానికి చెందిన అజ్మీరా ఇందిరానాయక్ అనే వ్యక్తిని ఇన్‌చార్జిగా నియమించారు. ఇక్కడ నాలుగైదు రోజులుగా ధాన్యం తూకం ప్రారంభించారు. అదే గ్రామానికి చెందిన గుంటి అంజయ్య, గుంటి గంగాధర్, పెంటల మల్లేశం తదితరులు ఆ కేంద్రంలో ధాన్యం పోయగా శనివారం తూకం వేశారు. తూకంలో అనుమానం వచ్చిన రైతులు తూకం రాళ్లు (బాట్లు) గమనించగా కింది బాగంలో హోల్ మూసివేసి ఉన్నట్లు గుర్తించారు. సంఘం సీఈవో గోపాల్ రెడ్డికి సమాచారం ఇచ్చి ఆయన సమక్షంలో ఎలక్ట్రానిక్ కాంటాతో తూకం వేశారు. ఒక్కో బస్తాలో 2 నుంచి నాలుగున్నర కిలోలు అదనంగా తూకం వేసినట్లు వెల్లడైంది. తూకం రాళ్లను మార్చి అదనంగా ఒక్కో సంచికి రెండు నుంచి నాలుగు కిలోల మోసానికి పాల్పడిన సదరు వ్యక్తిపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలంటూ రైతులు ఎస్సై రామకృష్ణకు ఫిర్యాదు చేశారు. కాగా తూకంలో మోసానికి పాల్పడిన సదరు వ్యక్తి తమనే బెదిరించాడని తమకు న్యాయం చేయాలంటూ బాధిత రైతులు ఆదివారం మండల కేంద్రంలో ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్‌తో మొరా ఎట్టుకున్నారు. జిల్లా అధికారులకు ఫోన్ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు లక్ష్మణ్ కుమార్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

మొదలైన మిల్లర్ల కొర్రీలు

మల్యాల: కొనుగోలు కేంద్రంలోని ధాన్యం అంతా సాధరణ రకం కిందే పరిగణిస్తూ అందించాలని మిల్లరు కొర్రీలు పెట్టడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ధాన్యం నాణ్యత పరిశీలించిన తరువాత గ్రేడ్‌లుగా పేర్కొనాల్సి ఉంది. మొత్తం సాధరణ రకంగా తీసుకుంటా మని తెలుపడంతో పాటు తూకం వేసిన ధాన్యంను సాధరణ రకంగానే తరలించాలని స్పష్టం చేయడంతో వారంతా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని బల్వంతాపూర్‌లో గల వరి ధాన్యం కొను గోలు కేంద్రంలో ఇటీవల తూకం వేసిన ధాన్యంను రెండు మిల్లులకు తరలిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం వరకు సుమారు 1,200 సంచుల ధాన్యం తూకం వేయగా మిల్లులకు తరలించలేదు. దీనిపై రైతులు ఆరా తీయగా సాధరణ రకం అయితేనే ధాన్యంను తీసుకుంటామని మిల్లర్లు తెలిపినట్లు తెలిసింది. ఏ గ్రేడ్ రకం ధాన్యంకు ప్రభుత్వం క్వింటాలుకి మద్దతు ధర రూ. 2,203, సాధరణ రకంకు రూ. 2,1 83 చెల్లిస్తుండగా మొత్తం ధాన్యంను సాధరణ రకంగా పరిగణిస్తే తాము నష్టపోవాల్సి వస్తుందని పైగా తూకం వేసిన ధాన్యంను తరలిం చకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ధాన్యం తరలకపోవడంతో ఆదివారం నిర్వహకులు తూకం నిలిపివేసినట్లు రైతులు తెలిపారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



తూకం వేసి రవాణ కోసం నిలిచిన ధాన్యం

మిల్లరును మార్చుతాం..

రైతుల వద్ద గల ధాన్యంను సాధరణ రకంగా తీసుకుంటామని తెలిపిన మిల్లరును మార్చడానికి అధికారులకు తెలిపారు. మిల్లరును మార్చి ధాన్యం నాణ్యతను బట్టి మద్దతు ధరలు అందిస్తాం. ధాన్యం తూకంలో రైతులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటాం.

- మిట్టపల్లి గోవర్ధన్, సీఈవో, ప్యాక్స్, మల్యాల

నేతన్నలను రెచ్చగొడుతున్న బీజేపీ, బీఆర్ఎస్

ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుదిళ్ల శ్రీధర్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

గంభీరావుపేట: ఏప్రిల్ 21: నేతన్నలకు కల్లబొల్లి మాటలు చెప్పి బీజేపీ, బీఆర్ ఎస్ పార్టీలు రెచ్చగొడుతున్నాయని ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొ న్నారు. గంభీరావుపేట మండల కేంద్రంలో మాజీ శాసనసభ్యుడు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కటకం మృత్యుంజయం, బృందాదేవిల కుమారుడు డాక్టర్ వేణుగోపాల్, డాక్టర్ అరుణాచల దేవి కుమారుడు కాళీ చరణ్ దత్తకు ఉప నయన కార్యక్రమానికి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హాజరై ఆశీర్వదించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. పదేళ్లుగా ఇక్కడి ప్రాంతా నికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పి ఇంతవరకు ఎలాంటి అవకాశాలు కల్పించారని బండి సంజయ్‌ని ప్రశ్నించారు. దేశవ్యాప్తంగా రెండు కోట్ల మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని పదేళ్లలో ఇరవై కోట్లమందికి ఉద్యోగాలు ఇస్తామని చెప్పి నిర్లక్ష్యానికి గురిచేశారని బీజేపీ ప్రభుత్వంపై మంత్రి మండిపడ్డారు. బ్యాంకు ఖాతా ఉన్న ప్రతితఈ ఒక్కరికి 15 లక్షల రూపాయలు ఖాతాలో వేస్తామని నయా పైసా వేయకుండా మోసం చేశారని ఆరోపించారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తామని చెప్పి రెండు సార్లు మద్దతు పెంచి ఉరుకున్నారన్నారు. ప్రకృతి వైపరీత్యం జరిగితే నష్టపోయిన రైతాంగాన్ని బీజేపీ ప్రభుత్వం ఆదుకోలేదన్నారు. 2107 నుంచి ఇంతవరకు రైతన్నలను ఆదుకున్న పాపాన పోలేదన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం చేపడుతుంటే బురద జల్లే యత్నం బీఆర్ఎస్ పార్టీ చేస్తోందన్నారు. ఫోన్ ట్యాపింగ్, అవినీతి, విషయంలో నిశ్శబ్ధంగా ఉన్న అటు బీజేపీకి, ఇటు బీఆర్ఎస్ పార్టీకి ఏవిధంగా ఓటు వేస్తారన్నారు.

ఏ నైతిక హక్కుతో ఓటేయాలని అడుగుతు న్నారో తెలపాలన్నారు. పది సంవత్సారాల కాలంలో ప్రజలు విసిగివే సారి మా ర్పు కోరుకున్నారన్నారు.

● నేతన్నల సంక్షేమానికి కృషి

నేతన్నల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. నేత కార్మికులు అయోమయానికి గురికావొద్దన్నారు. నేత కార్మికుల సమస్యలను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, నియోజక వర్గ ఇంచార్జ్ కెకె మహేందర్‌రెడ్డిలు ఎప్పటికప్పుడు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువస్తున్నా రన్నారు. నేతన్నలకు అండగా ఉంటడం కోసం మొదటి ఇడతలో రూ 50 కోట్లు మంజూరు చేశారన్నారు. నేతన్నలను బలోపేతం చేసే దిశగా కృషి చేస్తామని కాంగ్రెస్ వ్రభుత్వం అండగా ఉంటుందన్నారు. బీజేపీ, బీఆర్ఎస్‌ల కల్లబొల్లి మాటలు నమ్మి మోస పోవదద్దన్నారు. ఈకార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీని వాస్, మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయం, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దొమ్మాట నర్సయ్య, సద్ది లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి సాయం

మల్యాల, ఏప్రిల్ 21: మల్యాల మండల కేంద్రానికి చెందని గడ్డం రాజకుమారి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా మృతురాలి కుటుంబానికి మన నేస్తం హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్, ఓం యూత్ ఆధ్వర్యంలో ఆదివారం సాయం అందజేశారు. ఈ మేరకు రూ20వేల ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్మీ జవాన్ కీసరి గణేష్, రాజ్‌కుమార్, కర బూజ నర్సయ్య, కోరెపు వెంకటేష్, సాయితేజ, భానుప్రకాష్, వరుణ్‌కుమార్, వెంకటేష్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

హనుమాన్ దీక్షాపరులకు ముస్లిం మహిళ పండ్లు పంపిణీ

కోరుట్ల, ఏప్రిల్ 21 : పట్టణంలోని 17వ మాజీ కౌన్సిలర్, కాంగ్రెస్ పార్టీ మహిళా జిల్లా ఉపాధ్యక్షురాలు సోగాబీ హన్మాన్‌దీక్షా పరులకు ఆదివారం పండ్లు పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావుతో కలిసి సోగాబీ మాట్లాడుతూ పట్టణంలో హిందూముస్లింలు కలిసి మెలిసి ఉంటారని గుర్తు చేశారు. జువ్వాడి కృష్ణారావును శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో తిరుమల గంగాధర్, మహదేవస్వామి ఆలయ చైర్మన్ నరేశ్, గౌతమ్, సుధీర్ ఉన్నారు.

బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శిగా విజయ్ కుమార్

రాయికల్, ఏప్రిల్ 21: రాయికల్ పట్టణ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శిగా పట్టణానికి చెందిన ఇమ్మడి విజయ్ కుమార్‌ను నియమించినట్లు పట్టణ అధ్యక్షుడు సామల సతీష్ తెలిపారు. బీసీ సంక్షేమం దిశగా సామాజిక సేవా రంగాల్లో నిరంతరం కృషి చేస్తున్న విజయ్ సేవలు అభినందనీయమని అన్నారు.

విద్యార్థినులకు కంటి వైద్య పరీక్షలు

మల్యాల, ఏప్రిల్ 21: మల్యాలలోని కస్తూర్బా గాంధీ విద్యాలలయంలో విద్యార్థినీలకు ఆదివారం కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా 150మంది విద్యార్థులకు పరీక్షలు చేశారు. 15మంది కళ్లజోళ్లు అందజేయనున్నట్లు డిప్యూటీ డీఎంహెచ్‌వో ఎన్.శ్రీనివాస్ ఈ సందర్భంగా తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని ప్రభుత్వ గురుకులాలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో పరీక్షలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆప్తాల్మిక్ తిరుపతి కంటి పరీక్షలు నిర్వహించగా వైద్య సిబ్బంది, కస్తూర్బా ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్ ఫోన్ అందజేత

ధర్మపురి, ఏప్రిల్ 21: ధర్మపురి గోదావరి నది వద్ద హనుమాన్ దీక్షాపరుడికి ఆదివారం సెల్‌ఫోన్, జపమాలను పౌరోహితుడు సంగనభట్ల విద్యానాథ్ అందించారు. ఎండ తీవ్రత వల్ల త్వరగా స్నానం చేసి నది ఒడ్డున గల దేవాలయంలో ఒక హనుమాన్ దీక్షాపరుడు కొబ్బెరికాయలు కొట్టాడు. ఆ సమయంలో పక్కనే గల ఆలయం వద్ద ప్రహారి అవతల సెల్ ఫోన్, జపమాల మరచి పోయాడు. పూజారి సంగనభట్ల విద్యానాథ్‌కు ఆ సెల్‌ఫోన్, జపమాల దొరకడం వల్ల సదరు హనుమాన్ దీక్షాపరుడికి అందించారు. సంగనభట్ల విద్యానాథ్‌ను పలువురు స్థానికులు ప్రత్యేకంగా అభినందించారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో వార్షికోత్సవం

చందుర్తి, ఏప్రిల్ 21 : చందుర్తి మండలంలోని బండపల్లి, రామన్నపేట గ్రామాల్లో అంగన్వాడి కేంద్రాల్లో ఆదివారం వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు ఆటపాటల ద్వారా నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు బుర్ర రేణుక, న్యాత పద్మ, మంజుల, గసికంటి రేణుక చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో ఓటింగ్‌పై అవగాహన

కోరుట్ల, ఏప్రిల్ 21 : పట్టణంలో ఆదివారం సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో ఓటింగ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్స్ రాష్ట్ర కార్యదర్శి జిల్లా అధ్యక్షుడు హరిఅశోక్‌కుమార్ మాట్లాడుతూ 85 ఏళ్ళు నిండిన వృద్ధులు, 40 శాతం వైకల్యం ఉన్న దివ్యాంగులకు ప్రభుత్వం ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించిందన్నారు. ఓటు వజ్రాయుధంలాం టిదని ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు వినియోగించువాలని కోరారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక శాతం ఓటింగ్‌ను పెంచిన వయోవృద్ధులను అభినందిం చారు. కోరుట్ల డివిజన్ అధ్యక్షుడు పబ్బా శివానందం, రాజ్ మోహన్, సైఫోద్దీన్, లక్ష్మీనారాయణ ఉన్నారు.

ప్రతీ జిల్లాలో టెట్ పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయాలి

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 21: తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి జిల్లా కేంద్రంలో టెట్ పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ అన్నారు. ఆదివారం సిరిసిల్ల పట్టణం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం త్వరలో నిర్వహించే టెట్ పరీక్షలకు కొన్ని జిల్లాలోనే పరీక్ష కేంద్రాలను పరిమితం చేయడం వల్ల అభ్యర్థులకు ఇబ్బంది కలిగే అవకాశం ఉందని ప్రభుత్వం మరోసారి ఆలోచన చేయాలని అన్నారు. ప్రభుత్వపరంగా ప్రజలకు సేవలను అందించాలని గత ప్రభుత్వం తెలంగాణలో కొత్త జిల్లాలను ఏర్పాటు చేసిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జిల్లా కేంద్రాల్లో టెట్ పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసి అభ్యర్థులకు ఇబ్బంది లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్ఎస్వీ నాయకులు కోడం వెంకటేశం, దుమాల రవి, వసీం అక్రమ్, స్వామి, సమీ పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పరుగు పందెం ఎంపిక పోటీలు

- విజేతలకు సర్టిఫికెట్లు, బహుమతుల ప్రధానం

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 21: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సిరిసిల్ల పట్టణం మినీ స్టేడియంలో జరిగిన 3వ తెలంగాణ మిడిల్ అండ్ లాంగ్ డిస్టెన్స్ పరుగు (రన్నింగ్) పందెం ఎంపిక పోటీలకు క్రీడాకారుల నుండి స్పందన వచ్చింది. జిల్లా వ్యాప్తంగా ఉన్న అథ్లెటిక్స్ పరుగు పందెం క్రీడాకారులు వేసవి కాలంను కూడా లెక్క చేయకుండా పెద్ద సంఖ్యలో క్రీడలో పాల్గొన్నారు. ముందుగా పోటీలను జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొజ్జ చంద్రశేఖర్ ప్రారంభించారు. 14 సంవత్సరాల నుంచి 20 సంవత్సరాలలోపు బాలబాలికలు, యువతి యువకులు రన్నింగ్ లోని వివిధ విభాగాలలో పోటీ పడ్డారు. ప్రథమ ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచిన క్రీడాకారులకు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ నుండి మెరిట్ సర్టిఫికెట్లతో పాటు గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్‌ను అందజేసి అభినందించారు. ఈ నెల 28న సూర్యపేట జిల్లా కేంద్రలో జరిగి రాష్ట్ర స్థాయి పోటీలకు ఈ పోటీలో ఎంపికైన 25 మంది క్రీడాకారులు పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొట్టెముక్కల శేఖర్, వ్యాయామ ఉపాధ్యాయులు అజయ్‌కుమార్, పాల్గొన్నారు.

సమసమాజ స్థాపన అందరి లక్ష్యం కావాలి

- త్రిదండి చిన్న జీయర్‌స్వామి

వేములవాడ, ఏప్రిల్ 21: సమ సమాజ లక్ష్యంగా ప్రతిఒక్కరూ కృషి చేయాలని త్రిదండి రామా నుజ చిన్నజీయర్ స్వామి అన్నారు. వేములవాడ శాసనసభ్యుడు, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నివాసంలో ఆదివారం నిర్వహించిన లక్ష్మీవేంకటేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవంలో త్రిదండి చినజీయర్ స్వామి పాల్గొన్నారు. కల్యాణ మహోత్సవం అనంతరం ఆయన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వచనం అందించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కుటుంబ సభ్యులు లోక కల్యాణార్థం స్వామివారి కల్యాణాన్ని నిర్వహించడం సంతోష కరమని, భగవంతుడి ఆశీస్సులతో వేములవాడ నియోజకవర్గ ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని దీవించారు. రామానుజాచార్యులు సుమారు వెయ్యేళ్ల క్రితమే సమసమాజ స్థాపనకు కృషి చేసి గొప్ప సాధు వుగా పేరుగాంచారని అన్నారు. వేములవాడ ప్రాంతంలో ఒక గొప్ప నాయకునిగా ఆది శ్రీనివాస్ ఉన్నారని, ఆయన ఆధ్వర్యంలో ఈ ప్రాంతం దినదిన అభివృద్ధి చెందుతూ సుభిక్షంగా ఉండాలని కోరుకుంటున్నానన్నారు.

కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వెలిచాల రాజేందర్‌రావు, జిల్లాలోని పలువురు కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, పెద్ద భక్తులు పాల్గొన్నారు.

విద్యుత్ కోతలతో నిలుస్తున్న బ్యాంక్ సేవలు

- ● ఇబ్బందుల్లో ఖాతాదారులు
- ● మరమ్మతుల పేరుతో గంటల తరబడి కరెంటు కోతలు



కెనరాబ్యాంక్‌లో కరెంట్ కోసం ఎదురుచూస్తున్న ఖాతాదారులు

మల్లాపూర్, ఏప్రిల్, 21 : సమయం సందర్భం లేకుండా కరెంట్ కోతలతో రైతులు, ప్రజలే కాకుండా బ్యాంకుల్లో సేవలకు అంతరాయం ఏర్పడుతోంది. గ్రామాల్లో కరెంట్ కోతల వల్ల బ్యాంక్‌లోని సేవలు అందక ఖాతాదారులు ఇబ్బందులు పాలవుతున్నారు. విద్యుత్ మరమ్మతుల పేరుతో గంటల తరబడి ట్రాన్స్‌కో సిబ్బంది కోతలను విధిస్తున్నారు. మండలంలోని మొగిలిపేట గ్రామంలోని కెనరా బ్యాంక్‌లో కొద్ది రోజులుగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడటంతో ఖాతాదారులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. బ్యాంకు సేవలు అందకపోవడంతో పనులు కాక గంటల తరబడి నిరీక్షిస్తున్నారు. బ్యాంకులో జనరేటర్, ఇన్‌వర్టర్ సౌకర్యం లేక పోవడంతో ఖాతాదారులు రోజూ బ్యాంక్ చుట్టూ తిరుగుతున్నారు. ప్రతి రోజు బ్యాంక్‌కు వందల సంఖ్యలో రైతులు, వ్యాపారస్థులు, మహిళలు తదితరులు వస్తుంటారు. ఓబులపూర్, కొత్తధాంరాజుపల్లి గ్రామాలకు చెందిన ఖాతాదారులు బ్యాంకులో దాచుకున్న డబ్బులను తీసుకోవడానికి ఇప్పటికి నాలుగు సార్లు వచ్చి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అత్యవసర పరిస్థితిలో తమ డబ్బులను తీసుకుందామని వస్తే కరెంట్ లేదని లేనందున ఎలాంటి సేవలు చేయలేమని సిబ్బంది తెలుపుతున్నారు. బ్యాంకులో గంటల కొద్ది ఉన్న పనులు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలే వేసవి కాలం తీవ్రమైన ఎండలతో ఉక్కపోతతో గ్రామంలో తీవ్ర ఇబ్బందలకు గురువుతున్నట్లు వినియోగదారులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ కోతలను నివారించాలని, బ్యాంక్ అధికారులు జనరెటర్, ఇన్‌వెటర్‌లను ఏర్పాటు చేసుకొని బ్యాంక్ ఖాతాదారులుకు ఇబ్బందులు లేకుండా సేవలు అందించాలని కోరుతున్నారు.

మరమ్మతుల పేరుతో కోతలు..

గ్రామంలో విద్యుత్ మరమ్మతుల పేరుతో వారంలో పలు మార్లు గంటల తరబడి కోతలు విధిస్తున్నారు. గ్రామంలోని కార్యాలయాలు, వ్యాపారస్థులు, రైతులు, వినియోగదారులు తీవ్ర ఇబ్బందలు పాలవుతున్నారు. అసలే వేసవి కాలం తీవ్రమైన ఎండలతో ఉక్కపోతతో ఇండ్లలో ఫ్యాన్, కూలర్లు లేకపోతే ఉండలేని పరిస్థితి నెలకొంది. వారానికి రెండు, మూడు రోజులు మరమ్మతుల పేరుతో ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తున్నారు. గ్రామంలో తీవ్ర ఇబ్బందులకు గురువుతున్నట్లు వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోతలు అధికంగా విధించడం వలన పనులు జరగడం లేదని గ్రామంలో ని ప్రజలు వాపోతున్నారు. విద్యుత్ అధికారులు కరెంట్ కోతలు లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని కోరుతున్నారు.

బ్యాంక్ చుట్టూ మూడు సార్లు తిరుగుతున్న..

గంగారెడ్డి, బ్యాంక్ ఖాతాదారుడు, కొత్తధాంరాజుపల్లి



బ్యాంక్‌లోని డబ్బులు తీసుకోవడానికి మూడు సార్లు వచ్చాను. వచ్చినప్పుడల్లా బ్యాంకులో కరెంట్ లేదని తెలపడంతో గంటల కొద్ది ఉండి తిరిగి వెళ్తున్నాను. అత్యవసరమై డబ్బుల కోసం బ్యాంక్ వస్తే కరెంట్ లేదంటున్నారు. బ్యాంక్ వచ్చి రెండు గంటల అవుతున్న కరెంట్ రాలేదు. బ్యాంక్‌లో జన్‌రేటర్ కూడా లేదని కరెంట్ వచ్చినప్పుడు డబ్బులు ఇస్తామంటున్నారు.

బ్యాంక్‌లో బ్యాటరీలు పనిచేయడం లేదు

అశోక్, మొగిలిపేట కెనరాబ్యాంక్ బ్రాంచ్ మేనేజర్



బ్యాంక్‌లోని ఇన్‌వేటర్‌కు సంబంధించిన బ్యాటరీలు పనిచేయక పోవడంతో సేవల్లో ఇబ్బందులు ఏర్పాడు తున్నాయి. బ్యాటరీలను సమకూర్చాలని వరంగల్ రిజినల్ మేనేజర్ దృష్టికి తీసుకెళ్లాము. త్వరలోనే బ్యాటరీలను సమకూరిస్తే సమస్య తీరుతుంది. గ్రామంలో గంటల వ్యవధి కరెంట్ నిలిపివేస్తున్నారు. దీంతో ఖాతాదారులకు సరైన సేవలు అందించడంలో విఫలమవుతున్నాం.